సాక్షి
వికారాబాద్

మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025



రైతులకు శఠగోపం!

కొంత మంది వ్యాపారులు రైతులను ఆగం చేస్తున్నారు. తరుగు పేరిట వేరుశనగ రైతుకు శఠగోపం పెడుతున్నారు. 8లో▸



గీత దాటుతున్న మైనర్లు

మైనర్లు మద్యం సేవించి బైక్‌లు నడుపుతున్నారు. దీంతో పోలీస్‌లు కఠినంగా వ్యవహరిస్తున్నారు. 8లో▸



'పది'పై ప్రత్యేక శ్రద్ధ

పదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రభుత్వ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

టెండర్ల ఆహ్వానం

రేపు సాయంత్రం 5 గంటల వరకు అవకాశం

అనంతగిరి: జిల్లాలోని వివిధ శాఖలకు సంబంధించిన ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్, హాస్టల్స్, ఇతర ప్రభుత్వ భవనాలకు రంగులు వేసేందుకు 15 వేల లీటర్ల ఎక్స్‌టీరియర్ వాల్ పెయింట్స్ సప్లైయ్ కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు బుధవారం సాయంత్రం 5 గంటల లోపు తమ టెండర్లను కలెక్టర్ కార్యాలయంలోని ఏఓకు సమర్పించాలని సూచించారు.

వెబ్‌సైట్‌లో స్టాఫ్ నర్స్ మెరిట్ జాబితా

- 7 వరకు అభ్యంతరాల స్వీకరణ
- డీఎంహెచ్‌ఓ వెంకటరవణ

అనంతగిరి: జిల్లా వైద్యశాఖలోని ఎస్ఎన్‌సీయూ,ఎంహెచ్ఎన్, ఎన్‌సీడీ స్కీంలలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల ప్రావిజనల్ మెరిట్ జాబితా జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో (వికారాబాద్.తెలంగాణ.జీఓవీ.ఇన్) పొందుపరిచామని జిల్లా వైద్యాశాఖ అధికారి వెంకటరవణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లిస్టులో రిమార్క్స్‌నందు సూచించిన అభ్యంతరాలను సరిచేసుకునేందుకు ఈ నెల 7వరకు అన్ని పనిదినాలలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అప్లికేషన్‌కు జతచేసి కలెక్టరేట్‌లోని ఎస్–17లో ఉన్న తమ కార్యాలయంలో సమర్పించాలన్నారు. గడువు ముగిసిన అనంతరం ఎలాంటి అభ్యర్థనలు స్వీకరించమని స్పష్టం చేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

హాజరైన అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్



ప్రత్యేక పూజలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ పరిధి వెంకటాపూర్‌లోని శ్రీ జగదాంబ భవాని మాత, శ్రీ జగద్గురు సేవాలాల్ మహరాజ్ ఆలయ 18వ వార్షికోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు సోమవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఉత్సవ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో స్పీకర్ ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అనంతగిరిపల్లిలో నిర్మించిన లక్ష్మీనారాయణ స్వామి ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, ఆలయ ధర్మకర్త కిషన్ నాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, శ్రీదేవి, రెడ్యానాయక్, పరుశరాం తదితరులు ఉన్నారు.

8 నుంచి ఓంకారేశ్వర స్వామి ఆలయ ఉత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మైపాల్ రెడ్డి తదితరులు

కుల్కచర్ల: ఓంకారేశ్వర స్వామి ఆలయ ఉత్సవాలను విజయవంతం చేయాలని పాంబండ రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం బండ వెల్కిచర్లలోని పాంబండ ఆలయంలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 8 నుంచి 10 వరకు నిర్వహించనున్న ఉత్సవాలను విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, హోమం నిర్వహిస్తామని చెప్పా రు. ఈ కార్యక్రమంలో సతీశ్, ప్రకాశ్, చంద్ర య్య, చందు, పాంబండ ఆలయ పూజారి పాండుశర్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

మీర్‌పేట: మహిళ మెడలోని గొలుసును స్నాచర్ అపహరించిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మీర్‌పేట టీఎస్ఆర్‌నగర్‌లో నివాసముండే ఉడతల యాదమ్మ(65) స్థానికంగా వస్త్ర దుకాణం నిర్వహిస్తోంది. సోమవారం ఉదయం షాపు వద్దకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి కొనుగోలు దారుడిగా వచ్చి, ఆమె మెడలోని ఐదున్నర తులాల బంగారు గొలుసును తెంచుకొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాగునీటికి అమృత్-2.0

నాలుగు మున్సిపాలిటీలకు రూ.59 కోట్ల నిధులు

- తాండూరుకు అత్యధికంగా రూ.27 కోట్లు
- ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్ పనులకు ప్రాధాన్యత

నిధుల వివరాలు

మున్సిపాలిటీ	మంజూరైనవి
తాండూరు	రూ.27 కోట్లు
పరిగి	రూ.15.5 కోట్లు
వికారాబాద్	రూ.12 కోట్లు
కొడంగల్	రూ.4.5 కోట్లు
మొత్తం	రూ.59 కోట్లు



అమృత్-2.0 పథకంలో భాగంగా పరిగిలో కొనసాగుతున్న పైప్‌లైన్ పనులు

వికారాబాద్: జిల్లా పరిధిలోని నాలుగు మున్సిపాలిటీలకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్-2.0 పథకం కింద మంజూరు చేసిన నిధులతో తాగునీటి సరఫరాకు వినియోగించనున్నారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తిచేసిన మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు నాలుగు మున్సిపాలిటీల్లోనూ శంకుస్థాపనలు సైతం చేశారు. ఇప్పటికే పనుల ప్రారంభోత్సవానికి సామగ్రి చేరవేస్తున్నారు. పరిగి మున్సిపాలిటీలో సోమవారం పైప్‌లైన్ పనులు ప్రారంభమయ్యాయి. నాలుగేళ్ల క్రితమే బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంతో గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి వ్యవస్థను ఏర్పాటు చేయగా.. ఆయా కాలనీల్లో మరింత మెరుగు పరిచేందుకు ఈ పథకంలో ప్రాధాన్యత ఇస్తున్నారు.

కొత్తకాలనీలకు విస్తరణ

అమృత్-2.0 పథకంతో నూతనంగా నీటి వనరులను సృష్టించటం కాకుండా ఉన్న వనరులను సక్రమంగా సరఫరా చేసేందుకు కావాల్సిన సదుపాయాలు బలోపేతం చేస్తున్నారు. మున్సిపాలిటీల్లో (ఓహెచ్ఎస్ఆర్) ఉపరితల ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్‌ల ఏర్పాటు, నల్లా కనెక్షన్లు తదితర పనులు చేపడుతున్నారు. మిషన్ భగీరథలో భాగంగా ఈ పనులు అన్ని మున్సిపాలిటీల్లో చేపట్టగా.. నూతనంగా ఏర్పాటయిన కాలనీలకు వీటిని విస్తరిస్తున్నారు. ప్రస్తుతం వికారాబాద్ మున్సిపాలిటీలో రూ.68 వేలు, తాండూరులో రూ.80వేలు, పరిగిలో రూ.35 వేలు, కొడంగల్‌లో రూ.25వేల జనాభా ఉండగా వీరి అవసరాలకు అనుగుణంగా ఈ పథకంలో తాగునీటి వ్యవస్థను బలోపేతం చేసేలా ప్రణాళిక సిద్ధం చేసి పనులు చేపడుతున్నారు.

22 గంటల పాటు నీటి శుద్ధి

జిల్లాలో రెండు చోట్ల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (నీటి శుద్ధి కేంద్రాలు) అందుబాటులో ఉన్నాయి. పరిగి మండలం జాఫర్‌పల్లి సమీపంలోని వాటర్ ట్రీట్మెంట్ ప్లాంటులో రోజుకు 135 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్ పర్‌డే) నీటిని శుద్ధి చేసి పంపింగ్ చేసే సామర్థ్యం ఉండగా.. కొడగంల్‌లో 17 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్న శుద్ధి కేంద్రం అందుబాటులో ఉంది. రోజుకు 18 గంటల నుండి 22 గంటలు నీటి శుద్ధి చేపడతారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు పది లక్షల జనాభా నివసిస్తుండగా రోజుకు వారి అవసరాలకు 130 ఎంఎల్‌డీ నీరు అవసరం ఉంటుంది. ప్రస్తుతం రోజుకు జిల్లాలోని రెండు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో 145 ఎంఎల్‌డీ నీటిని శుద్ధి చేసి పంపింగ్ చేస్తున్నారు. వీటితో పాటు స్థానికంగా మరిన్ని అదనపు నీటి వనరులు అందుబాటులో ఉన్నాయి. వికారాబాద్‌లో శివారెడ్డిపేట్ చెరువు, తాండూరులో కాగ్నా వనరులతో పాటు అత్యవసర సమయం వేసవిలో మున్సిపాలిటీల్లో ఉన్న బోరుబావులు తదితర నీటి వనరులను వినియోగిస్తారు.



కలెక్టరేట్‌కు వచ్చిన హకీంపేట రైతులు

రూ.20 లక్షలు, ప్లాటు, ఉద్యోగం

- హకీంపేట్ రైతులతో కలెక్టర్ ప్రతీక్‌జైన్
- పరిహారం విషయంలో అపోహలు వీడాలని సూచన
- 218 రైతులు సమ్మతి పత్రాల అందజేత



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

దుద్యాల్: పారిశ్రామిక వాడ ఏర్పాటుకు భూమిలిచ్చే రైతులకు ఎకరాకు రూ.20లక్షల చొప్పున పరిహారం, 150 గజాల డీటీసీపీ లేఅవుట్ ప్లాటు, ఇందిరమ్మ ఇళ్లు, ఏర్పాటు చేసే కంపెనీల్లో ఇంటికి ఒక ఉద్యోగం కల్పిస్తామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం హకీంపేట్ గ్రామానికి చెందిన 218 మంది రైతులు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి 252 సర్వే నంబర్‌లో 351 ఎకరాల అసైన్డ్ భూమి అందిస్తామన్నారు. కంపెనీల ఏర్పాటుతో తమ పిల్లలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ పారిశ్రామికవాడ ఏర్పాటుపై రైతులకు అవగాహన కల్పించారు. పరిహారం విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని.. అపోహలు వీడాలని సూచించారు. అనంతరం 218 మంది రైతులు భూమిలిచ్చేందుకు సమ్మతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నా యక్, తాండూరు సబ్–కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్. ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి, దుద్యాల్ తహసీల్దార్ కిషన్, హకీంపేట్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీల వివరాలు సమర్పించండి

అనంతగిరి: శాఖల వారీగా ఖాళీగా ఉన్న పోస్టుల వి వరాలను సమర్పించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ని ర్వహించిన ప్రజావాణిలో ఆయన ఫిర్యాదులను స్వీ కరించారు. 106 దరఖాస్తుల్లో కారుణ్య నియామకా లు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్, రైతు భరోసా, రుణమాఫీ, సర్వే, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయి. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. కారుణ్య నియ మాకాల భర్తీ కోసం ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల భర్తీకి సంబంధించి వివరాలను రోస్టర్ పాయింట్‌ల వారీగా వివరాలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ఫిర్యాదులను పరిశీలించి సమ స్య పరిష్కార దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్‌డీఓ వాసుచంద్ర, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ

ప్రతిభను మెరుగుపరుచుకోవాలి

- ఎస్పీ నారాయణరెడ్డి
- రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ఏడుగురు అధికారులకు పతకాలు

అనంతగిరి: రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్–3లో జిల్లా నుంచి ఏడుగురు జిల్లా పోలీసు అధికారులు పతకాలు సాధించారు. వారిని సోమవారం ఎస్పీ నారాయణరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 01వరకు కరీంనగర్ వేదికగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఏడు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. ఆటలను పోలీసులు నిత్యకృత్యం చేసుకుని మరింతగా రాణించాలని సూచించారు. పోటీల్లో గెలుపోటములు సమానంగా స్వీకరిస్తూ ప్రతిభను మెరుగుపరుచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్ఐలు అంజాత్ పాషా,డేవిడ్,ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పతకాలు సాధించిన పోలీసులు పాల్గొన్నారు.

పతకాల వివరాలు

క్రీడ	అధికారి	పతకం
కనోయింగ్	అబ్దుల్ మన్సూర్	వెండి
హైజంప్	కె.స్వాతి	వెండి
హైజంప్	ఎ.శివదర్శన్	కాంస్యం
బాక్సింగ్	టి.ప్రకాశ్	కాంస్యం
తైక్వాండో	ఎన్.శ్రీను	కాంస్యం
తైక్వాండో	జి.శ్రీనివాస్	కాంస్యం
స్విమ్మింగ్	రబీందర్	కాంస్యం

బడ్జెట్ కేటాయింపులో వివక్ష

- డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

అనంతగిరి: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా సోమవారం వికారాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో విఫలమైన తెలంగాణ బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలన్నారు. రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు తగదన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సైతం నిధులు ఇవ్వలేకపోయిందని మండిపడ్డారు. భవిష్యత్‌లో వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గతేడాది జిల్లా పర్యటనలో నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని.. ఆ విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదని గుర్తు చేశారు. కాంగ్రెస్‌తోనే సంక్షేమం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, కుల్కచర్ల ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు అనంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సురేశ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు, పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

తాండూరులో.. కొడంగల్ జిల్లా ఆస్పత్రి!

- బోర్డు ఏర్పాటుతో దుమారం
- ఆందోళన చేపట్టిన ప్రతిపక్షాలు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యమేనన్న ఆస్పత్రి సూపరింటెండెంట్



తాండూరు జిల్లా ఆస్పత్రి ఎదుట కొడంగల్ జనరల్ ఆస్పత్రిగా ఏర్పాటు చేసిన బోర్డు



ఆస్పత్రి వద్ద గుమిగూడిన నాయకులు

తాండూరు: తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి బోర్డు స్థానంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కొడంగల్‌గా ఏర్పాటు చేయడంతో దుమారంలేపింది. గమనించిన స్థానికులు సదరు కాంట్రాక్టర్‌కు విషయం చెప్పగా ఆయన అక్కడకు చేరుకుని అధికారులే బోర్డు పెట్టమన్నారంటూ ఫొటోలు తీసుకుని అక్కడ నుంచి వెళ్లిపోయారు. దీంతో స్థానికులు ఈ ఫొటోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్‌తో పాటు పలువురు ప్రతిపక్ష నాయకులు అక్కడకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఆస్పత్రి పేరు మార్చినట్లే.. తాండూరును కొడంగల్‌గా మార్చే స్తారా అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ దర్మిది రవిశంకర్‌ను నాయకులు ప్రశ్నించగా.. కొడంగల్‌లో ఏర్పాటు చేయాల్సిన బోర్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో తాండూరులో ఏర్పాటు చేశారని.. విషయం తెలియగానే తీసివేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు.

మెడికల్ కళాశాల మంజూరు కోసమే..

కొడంగల్ నియోజవకర్గానికి ఎమ్మెల్యేగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఇటీవల కొడంగల్‌కు మెడికల్ కళాశాల మంజూరు చేయించారు. కొడంగల్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఉండాలి. నియోజకవర్గ పరిధిలో కేవలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. దీంతో తాండూరు జిల్లా ఆస్పత్రి బోర్డును కొడంగల్ జనరల్ ఆస్పత్రిగా మార్చారంటూ బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.

తహసీల్ కార్యాలయానికి తాళం వేసి నిరసన

ఇబ్రహీంపట్నం: చేసిన పనులకు రాకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయానంటూ ఓ కాంట్రాక్టర్ వినూత్న పద్ధతిలో నిరసన వ్యక్తం చేశాడు. తాను నిర్మించిన భవనానికి తాళం వేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించేందుకు పాత భవనం కూల్చివేశారు. తాత్కాలిక ఆఫీసు కోసం నిర్మాణ దశలో ఉన్న జెడ్పీ గెస్ట్ హౌస్‌ను ఎంచుకున్నారు. అసంపూర్తిగా ఉన్న గెస్ట్ హౌస్ పనులను ఆగమేఘాల మీద పూర్తి చేయాలంటూ ఆర్ అండ్‌బీ అధికారులు.. కాంట్రాక్టర్ దానయ్యకు పనులు అప్పగించారు. 2022 జనవరిలో పనులు పూర్తికావడంతో తహసీల్దార్ కార్యాలయాన్ని అందులోకి షిఫ్ట్ చేశారు. మూడేళ్లు గడిచినా బిల్లులు చెల్లించకపోవడంతో దానయ్య సోమవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి ఆందోళనకు దిగాడు. ఆయన మాట్లాడుతూ.. ఆర్‌అండ్‌బీ అధికారుల సూచన మేరకు రూ.50 లక్షతో జెడ్పీ గెస్ట్ హౌస్ భవనాన్ని అప్పులు తెచ్చి పూర్తి చేశానని తెలిపారు. వడ్డీ తడిసి మోపెడు కావడంతో తన 20 గుంటల భూమితో పాటు యంజాల్‌లోని ఓ ప్లాట్‌ను విక్రయించానని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తీరక ఆత్మహత్యాయత్నం చేయగా.. కుటుంబ సభ్యులు గమనించి కాపాడారన్నారు. ప్రస్తుతం కంప్రెషర్ వాహనంపై దినసరి కూలీగా పని చేస్తున్నానని వాపోయాడు. ఏంచేయాలో తోచక తహసీల్దార్ కార్యాలయానికి తాళం పెట్టానని, బిల్లులు వచ్చేలా చూడాలని అభ్యర్థించారు. విధులకు హాజరయ్యే సమయంలో తాళం వేయడంతో తహసీల్దార్ సునీతారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారువచ్చి కాంట్రాక్టర్‌తో మాట్లాడి కార్యాలయం తాళం తీయించడంతో వ్యవహారం సద్దుమణిగింది.

తాతను చూసేందుకు వెళ్తూ..



గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు (ఇన్‌సెట్లో) శ్రీనివాస్ (ఫైల్)

- ఏఆర్ కానిస్టేబుల్ దుర్మరణం
- అడవి పంది బైక్‌ను ఢీకొనడంతో ప్రమాదం
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- ఎమ్మెల్యే యాదయ్యకు గన్‌మెన్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్

శంకర్‌పల్లి: సెలవు రోజున తాతను చూసేందుకు వెళ్తున్న ఓ ఏఆర్ కానిస్టేబుల్‌ను అడవి పంది రూపంలో వచ్చిన మృత్యువు వెంటాడింది. ఈ సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకోగా.. సోమవారం ఉదయం వెలుగు చూసింది. వివరాలు .. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి బుల్కాపూర్‌కు చెందిన ముత్తంగి యాదయ్య, అమృతమ్మ దంపతులకు నలుగురు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు బుచ్చిరాజు కానిస్టేబుల్ కాగా.. మరో ఇద్దరు కుమారులు నగేష్, శ్రీకాంత్ వ్యవసాయం చేస్తున్నారు. నాలుగో కొడుకు శ్రీనివాస్ (30) 2018లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికై.. వికారాబాద్ జిల్లాలో పని చేస్తున్నాడు. తండ్రి సెంట్రింగ్ సామగ్రిని అద్దెకు ఇస్తుంటాడు. తల్లి నాలుగేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయింది.

నాలుగేళ్లుగా ..

శ్రీనివాస్ నాలుగేళ్లుగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సెలవు కావడంతో తన తాతను కలిసేందుకు రాత్రి వేళ సంగారెడ్డి జిల్లా రాంచంద్రాపురం మండలం వెలిమల గ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. తండా సమీపంలో ఇతని బైక్‌ను అడవి పంది బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి బీడీఎల్– భానూరు పోలీ సులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎమ్మెల్యే పరామర్శ

శ్రీనివాస్ మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యాదయ్య పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

వికారాబాద్ పోలీసులు అధికారిక లాంఛనాలతో శ్రీనివాస్ అంత్యక్రియలు నిర్వహించారు. ఆఖరి చూపుకోసం బంధువులు, మిత్రులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వికారాబాద్ ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్ఐ డేవిడ్ విజయ్‌కుమార్, ఆర్ఎస్ఐ శ్రీశైలం, రాము, శ్రీనివాస్‌బాబు తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజ్‌కుమార్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూనియన్ కార్యవర్గ సభ్యులు

మోమిన్‌పేట: సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎర్వ రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కమిటీ ఎన్నిక చేపట్టారు. ఉపాధ్యక్షుడిగా నర్సింహారాజు, ప్రధాన కార్యదర్శిగా క్రాంతికుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. సీపీఎస్‌తో ఉద్యోగులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానం తీసుకువచ్చేందుకు నిరంతరం పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీయూఎస్ జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, టీఎస్ యూటీఎఫ్ నాయకుడు బసప్ప, ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రికవరీ సెల్‌ఫోన్ల అప్పగింత


పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు అందజేస్తున్న పోలీసులు

ధారూరు: మండలంలోని వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న బాధితుల సెల్‌ఫోన్లను సీఐ రఘురాం సోమవారం రికవరీ చేశారు. 10 మంది బాధితులు తమ ఫోన్లను పోగొట్టుకున్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బాధితులకు సీఐ, ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్‌లు కలిసి అందజేశారు.

బైక్, క్వాలీస్ ఢీ

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

మొయినాబాద్: ఎదురెదురుగా పల్సర్ బైక్, క్వాలిస్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన ఎండీ అస్రఫ్(30) మండల పరిధి అమ్డాపూర్‌లోని ఓ ఫాంహౌస్‌లో ఉంటూ మేస్త్రీ పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి 8.50 గంటల సమయంలో అస్రఫ్, అతని స్నేహితులు ఇమ్రాన్, అస్గర్ కలిసి భాస్కర ఆస్పత్రి వైపు నుంచి అమ్డాపూర్ వైపు పల్సర్‌పై వెళ్తున్నారు. నజీబ్‌నగర్ సమీపంలోని సురబి వెంచర్ వద్ద ఉన్న మూల మలుపువద్ద బైక్ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న క్వాలిస్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. వారిని వెంటనే చికిత్సకోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. అస్రఫ్ చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. ఇమ్రాన్, అస్గర్ చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతూ..

వ్యక్తి ఆత్మహత్య

ఉప్పల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్ గాంధీనగర్ ప్రాంతానికి చెందిన గొల్లపల్లి రమేష్(30) సెంట్రింగ్ పని చేసేవాడు. గత కొంత కాలంగా అతను అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి లోనైన రమేష్ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

మద్యానికి బానిసై యువకుడు..

ఘట్‌కేసర్: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరుశురాం కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ద్వారకనగర్‌కు చెందిన దేరంగుల శేఖర్(32) డ్రైవర్‌గా పని చేసేవాడు. కొన్నాళ్లుగా మద్యానికి బానిసైన అతను తరచూ కుటుంబ సభ్యులు, భార్యతో గొడవ పడేవాడు. దీంతో అతడి భార్య వేరుగా ఉంటోంది. శనివారం మద్యం మత్తులో మరోసారి అన్నదమ్ములతో గొడవపడిన అతను అదే రోజు రాత్రి స్థానిక చిన్న చెరువు సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం రాత్రి దీనిని గుర్తించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కంచెలో చెలరేగిన మంటలు

యాచారం: కంచెలోని గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టగా.. చెలరేగిన మంటలను ఆర్పేందుకు పోలీసులు ముప్పతిప్పలు పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం– నక్కగుట్ట తండాల మధ్యన సోమవారం కొందరు పొలాల్లోని గడ్డికి నిప్పుపెట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు.. మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవడంతో ఇబ్రహీంపట్నం నుంచి ఫైరింజన్‌ను తెప్పించి మంటలను పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

మార్కెట్ ఫీజుకు ఎగనామం..

రైతులకు శఠగోపం!

- తండాలు, పల్లెల్లో జోరుగా వేరుశనగ జీరో దందా
- పొలాల వద్దకు వెళ్లి నేరుగా కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- ధర తగ్గించి చెల్లింపులు
- తరుగు పేరిట దోపిడీ


రాంపూర్‌తండా సమీపంలో వేరుశనగ కొనుగోళ్లు

ధారూరు: కొంతమంది వేరుశనగ వ్యాపారులు అమాయక రైతులను దోచేస్తున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్లో క్వింటాలుకు రూ.6,200 పలుకుతుండగా.. పొలాల వద్దకు వెళ్లి నేరుగా కొనుగోలు చేస్తూ క్వింటాలుకు రూ.5,800 చెల్లించారు. మార్కెట్ ఫీజు ఒక్కశాతం ఉండగా.. ఇక్కడ మాత్రం నాలుగు శాతం వసూలు చేశారు. ఇలా మండల పరిధిలోని రాంపూర్‌తండాలో సోమవారం పెద్ద ఎత్తున క్రయవిక్రయాలు నిర్వహించారు. జిల్లాలోని బొంరాస్‌పేట, పరిగి, తుంకిమెట్ల తదితర ప్రాంతాల నుంచి వచ్చి అమాయకులైన రైతులను బోల్తా కొట్టించారు. మార్కెట్‌కు వెళితే రవాణా ఖర్చులు ఉంటాయని, దీనికి తోడు పంటను తమకు అమ్మితే వెంటనే డబ్బులు ఇస్తామని మభ్యపెట్టారు. వేరుశగన పంట తీసి పొలాల వద్ద ఎండబెట్టిన రైతుల వద్దకు వెళ్లి.. లారీలకొద్ది సరుకును కొనుగోలు చేశారు. 30 కిలోల బస్తాలను తూకం వేసి.. తరుగు పేరిట బస్తాకు 2.200 కిలోల తరుగు తీశారు. ఇలా క్వింటాలుకు సుమారు 7కిలోల వరకు కోత పెట్టారు. ఇదేమని ప్రశ్నించే వారిని మీకేం సంబంధం అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. పంట పొలాలకు వెళ్లి నేరుగా వేరుశనగ కొనుగోలు చేస్తున్న వ్యాపారులు రైతుల వద్ద మార్కెట్ ఫీజు వసూలు చేసి మార్కెట్‌కు మాత్రం ఎగనామం పెడుతున్నారు. అధికారుల నిఘా లేకపోవడం, వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వీరి ఆటలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కొత్తగా ఏర్పడిన మార్కెట్ పాలకవర్గం సైతం వీటిని కట్టడి చేయలేకపోతోందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జీరో వ్యాపారం చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమాచారం ఇవ్వండి

పరిగి, బొంరాస్‌పేట్, తుంకిమెట్ల ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పంట పొలాల వద్దకు వెళ్లి వేరుశనగ కొనుగోలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపి మార్కెట్ ఫీజు వసూలు చేస్తున్నాం. సిబ్బంది కొరత కారణంగా దీన్ని పూర్తిగా నియంత్రించలేకపోతున్నాం. తండాలు, గ్రామాల్లో ఎవరైనా పంట ఉత్పత్తులు నేరుగా కొనుగోలు చేస్తే సెల్:8310739661 నంబర్‌కు సమాచారం ఇవ్వాలి.

– సిద్దమ్మ, మార్కెట్ కమిటీ కార్యదర్శి

రూ.23 లక్షలు పక్కదారి


సామాజిక తనిఖీలో డీఆర్‌డీఏ శ్రీనివాస్ ఇతర అధికారులు

- ఉపాధి హామీలో భారీగా అక్రమాలు
- సోషల్ ఆడిట్‌లో తేటతెల్లం
- రూ.2లక్షల రికవరికీ అధికారుల ఆదేశం

తాండూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్లెల్లో అమలు చేసే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భారీగా అవకతవకలు చోటు చేసుకుంటున్నాయి. క్షేత్రస్థాయిలో హామీ పథకంలో కొంత మంది సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పనికి వెళ్లకుండానే హాజరు నమోదు వేసి అందినకాడికి దోచుకున్నారు. మండల పరిధిలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు చేపట్టారు. మొత్తం రూ.4 కోట్లు ఖర్చు చేయగా కూలీల వేతనాలకు రూ.3.96 కోట్లు, సామగ్రికి రూ.17 లక్షల చెల్లింపులు చేశారు. ఇందులో దాదాపు రూ.23 లక్షలు పక్కదారి పట్టినట్లు సోషల్ ఆడిట్ అధికారుల బృందం ప్రకటించింది.

పనులు చేయకుండానే..

తాండూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ప్రజావేదికకు డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఏపీడీ సరళకుమారి, అంబుడ్స్‌మెన్ రాములు, సోషల్ ఆడిట్ సెక్షన్ ఆఫీసర్ భార్గవి తదితరులు హాజరయ్యారు. సామాజిక తనిఖీల్లో ఒక్కో గ్రామానికి సంబంధించి నివేదికలు బ్లాక్ రిసోర్స్ పర్సన్‌లు చదివి వినిపించారు. నారాయణపూర్, గోనూర్, బిజ్వార్, వీరశెట్టిపల్లి, పర్వాతపూర్, ఎల్మకన్నె, మిట్టబాసుపల్లి, చెన్‌గేస్‌పూర్, ఉద్దాండపూర్ గ్రామాల్లో బినామీ పేర్లపై ఉపాధి కూలీ డబ్బులు స్వాహా చేసినట్లు సోషల్ ఆడిట్‌లో తేలింది. గోనూర్‌లో 10 ఎకరాల ఉన్న పెద్ద రైతుల పొలాల్లో ఉపాధిహామీ పనులు చేపట్టినట్లు గుర్తించారు. బెలకటూర్‌లో పని ప్రదేశంలో కొంత మంది కూలీల పేర్లు గైర్హాజరైనట్లు నమోదు చేసి.. తర్వాత మళ్లీ రిజిస్టర్‌లో దిద్ది హాజరైనట్లు నమోదు చేసినట్లు ఆడిట్ సిబ్బంది తెలిపింది. గోనూర్‌లో ఫార్మేషన్ రోడ్డు పనుల్లో కూలీలు పని చేయకుండానే రూ.42 వేలు చేసినట్లు ఎంబీ నమోదు చేశారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో తమ కుటుంబ సభ్యుల పేర్లు రాసి కూలీ డబ్బులు తీసుకున్నట్లు తెలుస్తోంది.

ప్రతీసారి ఇదే తంతు

పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఈ సందర్భంగా డీఆర్‌డీఓ శ్రీనివాస్ హెచ్చరించారు. ప్రజావేదికలో రూ.2.79 లక్షలు మాత్రమే దుర్వినియోగం అయినట్లు ఆయన గుర్తించారు. సిబ్బందికి రూ.55 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. అలాగే ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే సామాజిక తనిఖీల్లో మండలంలో మొత్తం రూ.23 లక్షల నిధులు స్వాహా చేసినట్లు గుర్తిస్తే.. అధికారులు మాత్రం కేవలం రూ.2 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించడం గమనార్హం. ప్రతిసారి ఇదే తంతు నడుస్తోందని కూలీలు వాపోతున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు విశ్వప్రసాద్, సుదర్శన్ రెడ్డి, ఏపీఓ నరోత్తంరెడ్డి, ఈసీ మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

టెస్ట్ డ్రైవ్ చేస్తానని వాహనాలతో ఉడాయింపు

- ఇద్దరు బైక్ దొంగల అరెస్టు..
- పరారీలో మరొకరు
- ఆరు బైక్‌ల స్వాధీనం

జీడిమెట్ల: ఓఎల్‌ఎక్స్‌లో అమ్మకానికి ఉన్న బైకులు కొంటామని వచ్చి టెస్ట్‌డ్రైవ్ చేస్తామని నమ్మించి వాహనాలతో ఉడాయిస్తున్న ఇద్దరు వ్యక్తులను బాచుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ సురేష్‌కుమార్, బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, డీఐ యాదయ్యతో కలిసి వివరాలు వెల్లడించారు. బాచుపల్లి, కౌసల్య కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మహేష్ తన బైక్‌ను విక్రయించేందుకు ఓఎల్‌ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. దీనిని చూసిన సూరారం ప్రాంతానికి చెందిన ఒంగోలు రమేష్‌బాబు, చంద్రమోలు గుండప్ప, నరసింహతో కలిసి గత నెల 23 న మహేష్ ఇంటికి వచ్చారు. రమేష్‌బాబు మహేష్‌తో మాట్లాడుతుండగా మిగతా ఇద్దరూ దూరంగా ఉన్నారు. మహేష్‌తో మాట్లాడిన అనంతరం టెస్ట్‌డ్రైవ్ చేస్తానంటూ బైక్ తీసుకెళ్లిన రమేష్ బాబు తిరిగి రాలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన మహేష్ అదేరోజు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించిన పోలీసులు నిందితులు ముగ్గురూ మహేష్ ఇంటికి ఆటోలో వచ్చినట్లు గుర్తించి వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేశారు. ఆదివారం చోరీ చేసిన బైక్‌పై తిరుగుతున్న రమేష్, గుండప్పలను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులు ఇదే తరహాలో బాచుపల్లిలో 3, మియాపూర్‌లో, జగద్గిరిగుట్ట, మియాపూర్ ప్రాంతాల్లో ఒకటి చొప్పున బైక్‌ల చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. వారి నుంచి 6 బైకులను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు నరసింహ పరారీలో ఉన్నట్లు తెలిపారు. చాకచక్యంగా కేసును ఛేదించిన కానిస్టేబుళ్లు అంజయ్య, కనకయ్యలను డీసీపీ అభినందించి రివార్డులు అందజేశారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

చేవెళ్ల: ఆత్మరక్షణతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకునేందుకు కరాటే దోహదపడుతుందని కరాటే మాస్టర్ కృష్ణ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన మాస్టర్ జపాన్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో 6వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే కుంగ్‌ఫూ ఛాంపియన్ పోటీలలో చేవెళ్ల విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ చూపారని చెప్పారు. పర్పుల్ బెల్ట్ విభాగంలో జశ్వంత్ కుమార్ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం అందుకున్నాడని తెలిపారు. కట్టా విభాగంలో రిజ్వానబేగం, అయాన్, పద్మావతి, సాయి గణేశ్, దేవరాజ్ మొదటిస్థానంలో నిలవగా, రెండో స్థానంలో కృతిక్‌రాజ్, నాగశివ, మణి దీక్షిత్, లోకేశ్, సిద్దు అక్బర్‌లు పలు బెల్టుల విభాగాల్లో విజయం సాధించినట్లు చెప్పారు. విజేతలకు స్పీకర్ ప్రసాద్ కుమార్ బహుమతులు ప్రదానం చేశారని పేర్కొన్నారు.


పతకాలు సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

కాగ్నా నదిలో మృతదేహం

తాండూరువాసిగా గుర్తింపు

యాలాల: మండలంలోని కోకట్ కాగ్నా నదిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు పట్టణంలోని ముత్యాలగల్లికి చెందిన శ్రీనివాస్(40) కోకట్ కాగ్నా నదిలో నిర్జీవంగా పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. సమాచారం అందుకున్న యాలాల పోలీసులు మృతదేహాన్ని వెలికి తీశారు. ముందుగా గుర్తు తెలియని వ్యక్తిగా భావించారు. మృతుడి ఆనవాళ్లతో బాధిత కుటుంబ సభ్యులు తమను సంప్రదించినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, మద్యానికి బానిసై నీట మునిగి చనిపోయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. కూలీ పనులు చేసుకునే శ్రీనివాస్ భార్యతో కలిసి తాండూరులో ఉంటున్నాడు.

నర్సింగ్ మాజీ సూపరింటెండెంట్ మృతి

షాద్‌నగర్‌రూరల్: అనారోగ్యంతో నర్సింగ్ మాజీ సూపరింటెండెంట్ మృతి చెందారు. పట్టణంలోని క్రిస్టియన్ కాలనీకి చెందిన ఎస్‌డి హెలెన్ రూత్(70) ఆరోగ్య సమస్యలతో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆమె 1985 నుంచి 2007 వరకు షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో హెడ్ నర్సుగా, ఆ తర్వాత నగరంలోని కోఠి మెటర్నిటీలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. ఆమె అంత్యక్రియలను మంగళవారం షాద్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


డీఎస్పీ నర్సింగ్‌రావును అభినందించిన శాండిల్య

సాక్షి, సిటీబ్యూరో: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటిన తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ ఏఎన్‌బీ) డీఎస్పీ కె.నర్సింగ్‌రావును డైరెక్టర్ సందీప్ శాండిల్య సోమవారం అభినందించారు. కరీంనగర్‌లో గత మంగళవారం నుంచి శనివారం వరకు తెలంగాణ స్టేట్ పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ జరిగింది. 105 కేజీల పవర్ లిఫ్టింగ్ విభాగంలో పాల్గొన్న నర్సింగ్‌రావు బంగారు పతకం సాధించారు. ఈ నేపథ్యంలోనే ఆయన సోమవారం సందీప్ శాండిల్యను కలిశారు. నర్సింగ్‌రావును అభినందించిన ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

గీత దాటుతున్న మైనర్లు

మద్యం తాగి ఇష్టారీతిన డ్రైవింగ్

- చోటు చేసుకుంటున్న ప్రమాదాలు
- గాడిన పెట్టాల్సిన బాధ్యత తల్లిదండ్రులదని పోలీసుల సూచన


గోకఫసల్‌వాద్ శివారులో ఒకే బైక్‌పై వెళ్తున్న నలుగురు మైనర్లు

దౌల్తాబాద్: మైనర్లు.. అంటే 18 ఏళ్లలోపు వయసు కలిగిన పిల్లలు. ఈ వయసులో చదువు, ఆటలు, ఇల్లు, దోస్తులు... ఇవి వారి లోకం. అలాగే ఉండాలి కూడా. కానీ ఇటీవల వీళ్ల వయసుకు మించి పనులు చేస్తున్నారు. అయితే కొంతమంది మైనర్లు మద్యం తాగి రోడ్లపై ఇష్టారీతిన వాహనాలు నడిపి విన్యాసాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులూ సీరియస్‌గానే స్పందిస్తున్నారు. మైనర్లు తప్పు చేసినా కేసులు నమోదు చేసిన సంఘటనలు ఉన్నాయి.

రోడ్లపై హల్‌చల్

తెలిసీ తెలియని వయసులో మైనర్లు రోడ్లపై వాహనాలతో చక్కర్లు కొడుతున్నారు. వేగంగా దూసుకుపోతూ ఆనందపడుతున్నారు. కానీ అనుకోని ఘటన జరిగి రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే ఆ ఆనందం కాస్త విషాదమవుతుంది. ఇలాంటి ప్రమాదాల్లో వీరే కాదు.. ఎదుటి వ్యక్తుల ప్రాణాలకు పరేషానే. ఇటీవల మండలంలో ఓ బాలుడు రోడ్డు ప్రమాదం చేస్తే స్థానికులు, పెద్దలు మాట్లాడి ఇలాంటి సంఘటన జరగకుండా చూసుకోవాలని వారి తల్లిదండ్రులకు హెచ్చరించారు. మైనర్ డ్రైవింగ్‌పై సీరియస్‌గా దృష్టి పెట్టిన పోలీసులు అవగాహన కల్పించి తప్పులు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

పర్యవేక్షణ అవసరం

తమ పిల్లలు ఏం చేస్తున్నారనే విషయం ప్రతి తల్లిదండ్రులకు తెలియజేయాల్సిన అవసరం ఉంది. తమ కొడుకు ఎలా ఉన్నాడు. తన మనస్తత్వం ఎలా మారుతుంది. తన మిత్రులతో ఎటు వెళ్తున్నాడు. బయట అతడి పరిస్థితి ఎలా ఉంది. ఇలాంటి విషయాలను ఆరా తీస్తూ వారిని గాడిన పెట్టాల్సిన బాధ్యత ఉంది.

వయసుకు మించి..

వాహనాలను నడపడంతోనే మైనర్లు ఆగిపోవడం లేదు. తమ వయసుకు మించి పనులు చేస్తున్నారు. చాలా మంది యువత సిగరెట్లు, మద్యానికి బానిస అవుతున్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి ఇంట్లో దొంగతనాలు కూడా చేస్తున్నారు. ధూమపానం, మద్యపానంతో పాటు ఇతర గంజాయికి అలవాటు పడే అవకాశాలు ఉన్నాయి. రాత్రి పూట రోడ్లపై షికారు కొడుతున్నారు. సినిమా తరహాలో స్టంట్లు చేయడం, సైలెన్సర్లను మార్చి విపరీతమైన శబ్దంతో దూసుకుపోవడం వంటివి చేస్తున్నారు.

తల్లిదండ్రులు గమనించాలి



మైనర్ల విషయంతో ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరం. మైనర్లకు బైకులు ఇచ్చి ప్రమాదాలు జరిగినప్పుడు వారి తల్లిదండ్రులపై కేసులు పెడతాం. కావున పిల్లలు ఏం చేస్తున్నారన్న విషయాన్ని ప్రతి తల్లిదండ్రులు గమనించాల్సిన అవసరం ఉంది.

– రవిగౌడ్, ఎస్ఐ, దౌల్తాబాద్

ప్రజలను మోసం చేస్తే ఊరుకోం

- హామీల అమలుపై ప్రశ్నిస్తూనే ఉంటాం
- మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: ప్రజలను మోసం చేస్తే ఊరుకోమని.. హామీల అమలుకు ప్రశ్నిస్తూనే ఉంటామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి కేటీఆర్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేసీఆర్ ఆనవాళ్లను చెరిపివేసే దమ్ము లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. రుణమాఫీ సగం మంది రైతులకు కాలేదని ఆరోపించారు. గత నెల 26న నాలుగు హామీలు ప్రచారానికే తప్పితే అమలుకు నోచుకోలేదన్నారు. రైతు భరోసా మండలానికి ఒక గ్రామానికే ఇవ్వడం వెనుక ఆంతర్యం చెప్పాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. తండాలను పంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, తహేర్, మౌలానా, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాలపై చర్యలు తీసుకోండి


కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన సీపీఎం నాయకులు

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్

తాండూరు టౌన్: పట్టణంలోని టీహెచ్ జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతి లేకుండా కళాశాల నెలకొల్పి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న టీహెచ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. సుమారు 80 మంది విద్యార్థినులను కళాశాలలో చేర్చుకుని, అనుమతి లేకున్నా ఏడాది పాటు తరగతులు కొనసాగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అలాగే టీహెచ్ కళాశాల విద్యార్థినులను చైతన్య జూనియర్ కళాశాలలో చేర్పుకోవడంపై ఉన్నతాధికారులు తగు విచారణ జరపాలని ఫిర్యాదులో కోరారు.

'లక్ష డప్పులు' విజయవంతం చేయండి

ఎమ్మార్పీఎస్ నాయకులు


మొగులయ్యకు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కుల్కచర్ల: 'వేయి గొంతులు–లక్ష డప్పులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్, ఎమ్మార్పీఎస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు మొగుళ్లపల్లి మొగులయ్య కోరారు. సోమవారం చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఎన్నుకొని 'వేయి గొంతులు–లక్ష డప్పులు' ప్రదర్శన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని అందులో భాగంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రదర్శనకు ప్రతి గ్రామం నుంచి భారీగా తరలిరావాలని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కోస్గి మొగులయ్య, ప్రధాన కార్యదర్శిగా నర్సింలు, ఉపాధ్యక్షుడిగా భవానికుమార్, తదితర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘాల మండల అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.70 లక్షలు


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సుభాష్‌గౌడ్

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్‌గౌడ్

మోమిన్‌పేట: అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలను రూ.70లక్షలు వెచ్చిస్తున్నామని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మోమిన్‌పేటలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుభాష్‌గౌడ్ మాట్లాడుతూ.. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో మండలానికి రూ.4కోట్లతో సీసీ రోడ్లు నిర్మించేందుకు ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులను మంజూరు చేశారన్నారు. ప్రతీ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ అంజిరెడ్డి, నాయకులు విఠల్‌రెడ్డి, బస్వరాజ్, రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కేంద్రం కృషి

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి


మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి తదితరులు

షాబాద్: రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి అన్నారు. మోదీ సర్కార్.. కర్షకులకు ఎంతో మేలు చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒకేఒక గ్రామంలో రైతుభరోసా ఇవ్వడం విచారకరమని పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ నక్ష పటంలో ఉన్న రెవెన్యూ రికార్డుల్లో బాటలు, కాలువలు, గ్రామీణ ఉపాధి పథకం కింద చేర్చి, వాటిని సంరక్షించాలని సూచించారు. ప్రభుత్వ ఆధీనంలోని వ్యవసాయేతర భూములను కాపాడుతూ, వాటిల్లో మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో సంఘ్ జిల్లా కమిటీ సభ్యుడు వెంకట్‌రెడ్డి, షాబాద్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గౌతం, రైతులు బీమయ్య, సందీప్, బందిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.